క్లుప్తంగా

పుస్తకాలు, పెన్నుల వితరణ



విద్యార్థులతో ఎంపీపీ గౌరి, మధుసూదనరావు

బాడంగి: మండలంలోని కోడూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను ఎంపీపీ భోగి గౌరి, ఎంపీపీ సలహాదారు తెంటు మధుసూదనరావుల చేతులమీదుగా గురువారం అందజేశారు. ఆ గ్రామ ఎంపీటీసీ-1 మాజీ సభ్యురాలు దివంగత తెంటు భారతి ఏడో వర్ధంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం ఆమె భర్త తెంటు సత్యంనాయుడు మాస్టారు సౌజన్యంతో వాటిని వితరణ చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు మధుసూదనరావు తెలిపారు.

ఆలయ ప్రారంభోత్సవం రేపు

సంతకవిటి: మండలంలోని గోవిందపురం గ్రామంలో కొత్తగా నిర్మించిన శ్రీసీతారామ ఆలయం ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు శనివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. శనివారం ఉదయం గ్రామ ప్రదక్షిణ, వినాయక పూజ, పుణ్యాహవచనం, పరిషత్–ప్రాయశ్చిత్తం, పంచాగవ్య ఆరాధన, అగ్నిప్రతిష్ఠ, అంకురారోపణ, ధ్వజ పతాకావిష్కరణ, జలాధివాసం, ఆదివారం క్షీరాధివాసం, ప్రాతఃకాలార్చన, సూర్యారాధన, సర్వదేవతా మంత్ర హోమాలు, ధాన్యాధివాసం, షోడాన్యాసాలు, శయ్యాధివాసం, విశేష హోమాలు, దిగ్బలి, వేదస్వస్తి కార్యక్రమాలు, సోమవారం ఉదయం శ్రీరామచంద్ర పట్టాభిషేక చిత్రపటం పూజలు, యంత్ర శిఖర ప్రతిష్ఠలు, కళావాహన, ప్రాణప్రతిష్ఠ, అవబృధ స్నానం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అదేరోజు మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన

రాజాం: మండలంలోని రామినాయుడువలస గ్రామంలో క్షయవ్యాధి నివారణపై గురువారం అవగాహన కల్పించారు. బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి సిద్ధీశ్వరి, క్షయవ్యాధి నిర్మూలన విభాగం డివిజనల్ సూపర్‌వైజర్ జి.లలిత.. వ్యాధి నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, ప్రజలకు వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

ఆకస్మిక తనిఖీలు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని మూడు బార్ షాపుల్లో ఎక్సైజ్ ఎస్టీఎఫ్ అధికారులు రాజ్యలక్ష్మి, గంగాధర్, సీఐ పి.చిన్నంనాయుడులు సిబ్బందితో కలిసి గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించకుండా మద్యం విక్రయాలు చేయాలని సూచించారు. అక్రమంగా వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆన్‌లైన్‌లో మార్కులు నమోదు చేయండి

తెర్లాం: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జరుగుతున్న ఎఫ్ఏ-3 పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంఈవో జె.త్రినాధరావు సూచించారు. మండల కేంద్రంలోని గౌతమ్ హైస్కూల్‌లో జరుగుతున్న ఎఫ్ఏ-3 పరీక్షలను ఆయన గురువారం తనిఖీ చేశారు. పరీక్షలు పూర్తయిన తర్వాత జవాబు పత్రాలను మూల్యాంకనం చేయాలన్నారు. సబ్జెక్టుల వారీగా ఆన్‌లైన్‌లో విద్యార్థుల మార్కులు నమోదు చేయాలని సూచించారు.

విద్యాప్రమాణాలు మెరుగుపరచాలి



విద్యార్థితో పదాలు చదివిస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఈవోలు త్రినాధరావు, పాపారావు సూచించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల(హెచ్)ను వారు గురువారం సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం వివిధ ప్రశ్నలు అడిగి విద్యార్థుల విద్యాప్రమాణాలు పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాలు వండి పెట్టాలని, చదువులో వెనకబడ్డ విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలని కోరారు.

బియ్యాన్ని తూకం వేసి తీసుకువెళ్లాలి

తెర్లాం: మండలంలోని అన్ని రేషన్ డిపోల డీలర్లంతా ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి రేషన్ బియ్యాన్ని తూకం వేసి మరీ తీసుకువెళ్లాలని తహసీల్దారు జి.హేమంత్‌కుమార్ సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సీఎస్‌డీటీ స్వర్ణలత ఆధ్వర్యంలో రేషన్ డీలర్ల సమావేశం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రేషన్ షాపుల డీలర్లంతా ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి బియ్యాన్ని తూకం వేసి తీసుకువెళితే ఎటువంటి తరుగు ఉండదన్నారు. అలాగే ఎండీయూ వాహనాలకు రేషన్ డిపోల నుంచి బియ్యాన్ని పంపించినప్పుడు తప్పనిసరిగా వారికి కూడా తూకం వేసి ఇవ్వాలన్నారు. రేషన్ దుకాణాలపై ఫిర్యాదులొచ్చినా, ఎండీయూ వాహనాల ద్వారా తూనికలో తేడాలున్నట్లు తెలిసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

అటకెక్కిన 'ఫ్రైడే డ్రైడే'!

- గ్రామాల్లో కానరాని డ్రైడే కార్యక్రమాలు
- రోడ్ల మీదే చెత్తాచెదారం
- ప్రబలుతున్న విషజ్వరాలు
- ఆందోళనలో ప్రజలు



పాలిథిన్, ప్లాస్టిక్ వ్యర్థాలతో సిరిపురం మురుగు కాలువ, రోడ్డు



కంచరాం దగ్గర ప్రధాన రోడ్డు సమీపంలో చెత్తాచెదారం

రాజాం: స్వచ్ఛతే లక్ష్యంగా ప్రారంభించబడిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమం అటకెక్కింది. దీంతో గ్రామాలు అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. రోడ్లపై ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోయి తారసపడుతోంది. మురుగు కాలువలు, నీటి నిల్వలు ఉన్నచోట దోమలు అధికమై విషజ్వరాలు విపరీతంగా ప్రబలుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇదే కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసేది. ప్రతీ శుక్రవారం వైద్యారోగ్య సిబ్బందితో గ్రామీణ ప్రాంతాల్లో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలతోనే వారి ఇంటి పరిసరాలు పొడిగా(అనవసర నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రంగా) ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగింది. మరోవైపు ప్రతిరోజూ గ్రీన్ అంబాసిడర్ల(క్లాప్‌మిత్రలు) ద్వారా ప్రతీ ఇంటి నుంచి చెత్తను సేకరించి, ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త సంపద తయారీ కేంద్రాలు)లకు తరలించడం జరిగేది. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాల పరిశుభ్రత కళ్లకు కట్టినట్లు కనిపించేది. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి గ్రామాల్లో తలకిందులైంది. ప్రధానంగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమం తూతూమంత్రంగా కొనసాగుతోంది. గత కొన్ని నెలలుగా వీటి జాడ కానరావడం లేదు. ఇప్పుడు ఏ గ్రామంలో చూసినా ఖాళీ స్థలాల్లో చెత్త పోగులు పోగులుగా కనిపిస్తోంది. ఇవే చెత్తకుప్పలు దోమలకు ఆవాసాలుగా మారి, విషజ్వరాలు ప్రబలేలా పరిస్థితి మారింది. ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఆ రెండు శాఖల పర్యవేక్షణ ఏదీ?

గ్రామాల్లో ప్రతీ శుక్రవారం చేపట్టే ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను పంచాయతీరాజ్‌తో పాటు వైద్యశాఖలోని మలేరియా విభాగం పర్యవేక్షించేది. ప్రధానంగా మలేరియా జ్వరం కలిగించే దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడేది. ప్రతీ ఇంటి వద్ద పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమం దోహదపడేది. ఇదివరకు గ్రామాల్లోని చెత్తను క్లాప్ మిత్రలకు అందించేందుకు రెండు రకాల చెత్త బుట్టలు అందించేవారు. తడి, పొడి చెత్తలను వేర్వేరు బుట్టల్లో సేకరించి, క్లాప్‌మిత్రలు వాటిని ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించేవారు. ఇప్పుడు పంచాయతీరాజ్ విభాగంతో పాటు వైద్యశాఖ ఈ కార్యక్రమానికి మంగళం పాడింది. గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాల్సిన మండల పరిషత్ అధికారులు కూడా ఏమీ పట్టనట్లు వ్యవహరించడం, మలేరియా విభాగం జిల్లా అధికారులు సైతం దృష్టిసారించకపోవడంతో డ్రైడే కనుమరుగైంది. ప్రజలకు అవగాహన కల్పించేవారితో పాటు హెచ్చరించేవారు లేకపోవడంతో ఖాళీ రోడ్లు, స్థలాలు పెంటకుప్పలుగా మారుతున్నాయి. డ్రైడేను పక్కనబెట్టిన అధికారులు ఇప్పుడు ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అయితే వీటి నిర్వహణను ఎంత చిత్తశుద్ధి, నిబద్ధతతో చేస్తారో వేచి చూడాలి.

దోమలు విజృంభిస్తున్నాయి..

మా గ్రామంలో ప్రధాన రోడ్డు మీదే చెత్తను విచ్చలవిడిగా వేసేస్తున్నారు. దోమలు విజృంభిస్తున్నాయి. గ్రామస్తులు జ్వరాల బారినపడుతున్నారు. గతంలోని పారిశుధ్య కార్యక్రమాలు ఇప్పుడు లేవు. ఎక్కడపడితే అక్కడే చెత్తకుప్పలు కనిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేదు.

పి.రామారావు, సిరిపురం, సంతకవిటి మండలం

అపరిశుభ్రంగా రోడ్లు..

మా గ్రామ రోడ్లు అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. ప్రజలు వేసే చెత్తాచెదారంతో రోడ్లన్నీ నిండిపోయాయి. గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించేవారు కరువయ్యారు. అధికారులు స్పందించి, డ్రైడే కార్యక్రమం వంటివి చేపట్టాలి.

–ఆర్.రామకృష్ణ, కంచరాం, రాజాం మండలం

సీఎం చంద్రబాబు మోసాలు బట్టబయలు



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బెల్లాన, పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేష్ తదితరులు

రాజాం: సీఎం చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలన్నీ అబద్ధమని, ఆయన మోసాలు ఇప్పుడు ఒక్కొక్కటిగా బట్టబయలవుతున్నాయని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌లు విమర్శించారు. ఇదే విషయమై స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా ఇంతవరకు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని ఆరోపించారు. 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామన్నారని, ఏడాది కాలంగా ఇవ్వాల్సిన కొత్త పింఛన్లలో ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. మెగా డీఎస్సీ పేరుతో డీఎస్సీ అభ్యర్థులను మోసం చేశారని దుయ్యబట్టారు. అధికారం కోసం చంద్రబాబు.. చంద్రముఖి అవతారమెత్తుతారని జగనన్న చేసిన ఆరోపణలే ఈరోజు నిజమయ్యాయన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలన్నీ అమలు చేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అని, ఇప్పటి సీఎం చంద్రబాబుది నయవంచన అని ధ్వజమెత్తారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు హామీలు ఇచ్చినప్పుడు తెలియదా అని ప్రశ్నించారు. రోజురోజుకూ చంద్రబాబు మోసాన్ని ప్రజలు గమనిస్తున్నారని, ఓటేసిన పాపానికి ఐదేళ్లు భరించాల్సిందేనని మదనపడుతున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, పార్టీ రాజాం పట్టణ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

రాజాం సిటీ: విద్యార్థులు తమకు వచ్చిన అవకాశాల ద్వారా సాంకేతికతను అందిపుచ్చుకోవాలని జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. స్థానిక జీఎంఆర్ ఐటీలో ఈ నెల 27 నుంచి యూఏవీ టెక్నాలజీ, నావిగేషన్ సిస్టమ్‌లు, ఫ్లైట్ కంట్రోలర్స్, సెన్సార్ ఫ్యూజన్, డ్రోన్ అప్లికేషన్లపై అందించిన శిక్షణ గురువారంతో ముగిసింది. ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం, ప్రాక్టికల్ అనుభవం అందించడమే లక్ష్యంగా ఈ వర్క్‌షాపు నిర్వహించామని, ఈ నెల 31న హైదరాబాద్‌లో జరగనున్న శిక్షణలో 40 మంది విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి..

రాజాం సిటీ: విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా లక్ష్యాలు సులభంగా సాధించవచ్చని డాక్టర్ బీఆర్ ఏయూ బీసీడీఈ కో–ఆర్డినేటర్ అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక జీసీఎస్‌ఆర్ కళాశాలలో బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషన్(బీసీడీఈ), లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఒక్కరోజు శిక్షణ గురువారం ఇచ్చారు. డిగ్రీలో భాగంగా ఇంటర్న్‌షిప్ చేస్తున్న విద్యార్థులు గ్రామాల్లోని విద్యార్థులకు విద్యాబోధన చేయడం ద్వారా బోధనా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చని ఆయన అన్నారు.

సక్రమంగా ఎస్‌డబ్ల్యూపీసీలను నిర్వహించాలి

రాజాం: ప్రతీ పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త సంపద తయారీ కేంద్రం)లను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని అంతకాపల్లి, వీఆర్‌అగ్రహారం గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీలను ఆయన గురువారం పరిశీలించి, క్లాప్‌మిత్రలకు పలు సూచనలు చేశారు. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తాచెదారాన్ని తీసుకువచ్చి, సేంద్రియ ఎరువు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వి.చిన్నంనాయుడు, డి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: ఎస్‌డబ్ల్యూపీసీల్లో చెత్త నుంచి ఎరువు తయారు చేసి, సబ్సిడీపై రైతులకు అందివ్వాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సిబ్బందికి సూచించారు. మండలంలోని భీమవరం, ముగడ ఎస్‌డబ్ల్యూపీసీలను గురువారం సందర్శించిన ఆయన.. ఎస్‌డబ్ల్యూపీసీలను సక్రమంగా నిర్వహించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వంగర: మండలంలోని మద్దువలస ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నట్లు ట్రాన్స్ కో ఏఈ వేగిరెడ్డి సాంబశివరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ తీగలను తాకే చెట్లకొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతు పనుల కారణంగా ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

బొబ్బిలి: పట్టణంలోని 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఈఈ ఎ.అనంతరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్న ఒంటిగంట వరకు గాంధీబొమ్మ జంక్షన్, చీపురుపల్లి వారి వీధి, వాటర్‌ట్యాంకు, మెహర్ కాలనీ, వెలమ వీధి, పోలీస్‌స్టేషన్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.


'గాదె' విజయానికి కృషి చేయాలి

బొబ్బిలి: ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులునాయుడు గెలిచేందుకు కృషి చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడక బలరాంనాయుడు కోరారు. స్థానిక పట్టణంలో ఆ సంఘ ప్రాంతీయ మండలాల కార్యకర్తలతో గురువారం సమావేశమైన ఆయన.. విద్య, ఉపాధ్యాయ రంగాల సమస్యలపై అవగాహన ఉన్న వారిని గెలిపించుకుంటే ఆయా సమస్యల పరిష్కారం సులభమవుతుందన్నారు. ఏపీటీఎఫ్.. శ్రీనివాసులునాయుడుకు మద్దతు ఇస్తోందని ప్రకటించారు.

రెండు పూటలా పనులు చేయించాలి

రేగిడి: ఉపాధి హామీ పథకం పనుల్లో వేతనదారులతో రెండు పూటలా పనులు చేయించాలని ఏపీవో ఎస్.హరనాధరావు సూచించారు. మండలంలోని లింగాలవలస గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన గురువారం పరిశీలించారు. పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయాలని, పని ప్రదేశంలో తాగునీరు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

● గాంధీ మార్గం ప్రపంచానికి ఆదర్శం




రాజాంలోని గాంధీ వీధిలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న స్థానికులు




తెర్లాం శాఖా గ్రంథాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

వాడవాడలా మహాత్మాగాంధీ వర్ధంతి గురువారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులంతా కలిసి గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. దేశ స్వాతంత్య్ర సాధనకు ఆయన అనుసరించిన అహింసా మార్గం ప్రపంచానికే ఆదర్శమన్నారు. ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



రాజాం సిటీ: గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు



బొబ్బిలి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు తదితరులు



బొబ్బిలిరూరల్: ఎంపీడీవో కార్యాలయంలో మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో రవికుమార్ తదితరులు

● ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు డిమాండ్ చేస్తున్నారు. వంగర మండల పరిధిలోని అరసాడ ఐసీడీఎస్ సెక్టార్ సమావేశం గురువారం నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే జీతభత్యాలు, ఇతర సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తూ రాష్ట్రపతి ద్రౌపదిముర్మును ఉద్దేశించి, లేఖ రాశారు. అనంతరం వాటిని ప్రదర్శించారు. –వంగర

● ఆక్రమణలు తొలగించండి



ప్రభుత్వ భూమిలోని ఆక్రమణలను తొలగించాలని రేగిడి మండలం, బూరాడ గ్రామ సర్పంచ్ వావిలపల్లి శశిభూషణరావు కోరారు. ఇదే విషయమై ఆయన.. తహసీల్దారు ఎం.చిన్నారావు, ఎంపీడీవో శ్యామలాకుమారి, ఎస్ఐ నీలావతిలకు గురువారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామంలోని సర్వే నంబరు 64–2లోని 3.12 ఎకరాల కొండపోరంబోకు భూమి ఉందని, దానిని కొంతమంది ఆక్రమించుకుని అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు స్పందించి, ఆక్రమణదారులు ఆ ప్రదేశంలో వేసిన మట్టిని తొలగించాలని విజ్ఞప్తి చేశారు. –రేగిడి

● గోతిలో దిగితే ఆస్పత్రే..



రాజాం గాయత్రి కాలనీ నుంచి పెనుబాక గ్రామం వరకు ఉన్న ప్రధాన రోడ్డు చాలా అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా రోడ్డు మధ్యలోని గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో అటువైపుగా వెళ్లే వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్రమత్తంగా లేకపోతే గోతిలో పడి గాయాలపాలై ఆస్పత్రి పాలవ్వడం ఖాయమంటున్నారు. ఆర్అండ్‌బీ ఏఈ నాగభూషణానికి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేని, ఈ విషయాన్ని కలెక్టరు దృష్టికి కూడా తీసుకువెళ్తామని జెడ్పీటీసీ బండి నర్సింహులు అన్నారు. –రాజాం

ఇస్తామన్న పథకాలు ఇవ్వననడం మోసం కాదా?

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇస్తానన్న హామీలు ఇప్పుడు ఇవ్వననడం మోసం చేయడం కాదా అని సీఎం చంద్రబాబునాయుడును మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ప్రశ్నించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడిన ఆయన.. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన నవరత్నాలు(హామీలు) కన్నా ఎక్కువ బడ్జెట్ హామీలు ఇచ్చి, ఇప్పుడు భయమేస్తోంది.. నా వల్ల కాదు.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడిన తర్వాత ఇస్తాననడం ఎంతవరకు సమంజసమని, ఇది నయవంచన కాదా అని నిలదీశారు. నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యావు.. హామీలు ఇచ్చినప్పుడు రాష్ట్ర బడ్జెట్, ఆర్థిక స్థితిగతులు తెలియవా.. అవేమీ తెలియకుండానే హామీలు ఇచ్చేశావా అని దుయ్యబట్టారు. ఇప్పటివరకు సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్కటీ అమలుచేయకపోవడం దారుణమని, చంద్రబాబును నమ్మి మోసపోయామని ప్రజలంతా అనుకుంటున్నారన్నారు. 2014 ఎన్నికల్లో కూడా ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం వల్లే ఓడిపోయావన్న విషయం తెలీదా.. మళ్లీ అదే గతి పడుతుందని జోస్యం చెప్పారు. ప్రస్తుతం ఇస్తున్న పింఛన్లలో కూడా కోతలు మొదలయ్యాయని, లబ్ధిదారులు ఉసూరుమంటున్నారన్నారు. నిరుపేదలకు ఇస్తున్న పింఛన్లు అనర్హత పేరుతో తొలగిస్తే వారి నోటి దగ్గర కూడు లాగేసుకున్నట్లేనని ఆ పాపం ఊరికే పోదన్నారు. జనం నమ్మినంత కాలం మీ ఆటలు సాగుతాయని, అదే జనం చైతన్యవంతులైతే మిమ్మల్ని ఎక్కడ కూర్చోబెడతారో 2019 ఎన్నికలు గుర్తు చేసుకోవాలన్నారు. తాము ఏమి చెప్పినా జనం నమ్ముతారని అనుకోవడం నిజంగా మూర్ఖత్వమేనన్నారు. ఇలా మాటిమాటికి ఓట్లేసిన జనాన్ని మోసం చేయడం తగదన్నారు. సీఎం చంద్రబాబు మోసాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని, ఆయన చెబుతున్నవన్నీ మోసపూరిత మాటలేనని జనమంతా గ్రహిస్తున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్, ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సోషల్ మీడియా కార్యకర్తలపై చేస్తున్న కక్ష సాధింపు చర్యలను చూస్తున్నారన్నారు. చంద్రబాబు మోసాలను ప్రజలు క్షమిస్తారేమో గానీ ఆ భగవంతుడు మాత్రం క్షమించరన్నారు. ప్రజలే రానున్న రోజుల్లో గట్టి బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, జెడ్పీటీసీ పి.రామారావు, నాయకులు ఎస్.వేణుగోపాలనాయుడు, దామోదరరావు, రాయలు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనే లక్ష్యం



రామభద్రపురం: ప్రతిజ్ఞ చేస్తున్న స్టేట్ పీపీఎం కో–ఆర్డినేటర్ అరుణకుమారి, ఎంపీడీవో రత్నం, తహసీల్దారు సులోచనరాణి

రామభద్రపురం: కుష్టువ్యాధి నిర్మూలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని స్టేట్ పీపీఎం కో–ఆర్డినేటర్ ఎస్.అరుణకుమారి సూచించారు. స్థానిక ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయాల సిబ్బందికి కుష్టువ్యాధి నిర్మూలనపై గురువారం అవగాహన కల్పించారు. రెండేళ్ల వయసు దాటిన ప్రతిఒక్కరికీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి, స్క్రీనింగ్ చేయడం జరుగుతోందన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే చికిత్సకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం వ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు.

రాజాం: మండలంలోని బొద్దాం, పెనుబాక, గార్రాజుచీపురుపల్లి, పొగిరి, గడిముడిదాం, నందబలగ తదితర గ్రామాల్లో ఇంటింటా లెప్రసీ సర్వే నిర్వహించారు. ఎక్కడా వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వ్యక్తులు నమోదు కాలేదని బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సిద్ధీశ్వరి, డాక్టర్ నరేంద్ర తెలిపారు.

గొర్రెలు, మేకల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

వంగర: గొర్రెలు, మేకల పెంపకం చేపట్టడంతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని రాష్ట్ర ప్రత్యేకాధికారి డాక్టర్.వై.వి.రమణ అన్నారు. మండలంలోని మగ్గూరులో ప్రభుత్వం మంజూరు చేసిన మేకల పెంపకం యూనిట్‌ను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం మినీగోకులం ఏర్పాటుకు నిర్మిస్తున్న భవనాలను చూశారు.